# అల్జీరియా | ప్రభుత్వ పాలనను కుదిపివేస్తున్న ప్రదర్శనలూ, సమ్మెలూ

**"హంతక** రాజ్యం" "రాజ్యం నశించాలి" "దేశాన్ని దోచుకుతిన్న దొంగలారా!" మొదలైన నినాదాలతో అల్జీరియా దేశ రాజధాని అల్జీర్స్‌తో పాటు రేవు పట్టణం బెజాయియా తదితర పట్టణాలలో లక్షలాదిమంది ప్రజలు, మరీ ముఖ్యంగా యువకులు ప్రదర్శనలు నిర్వ హించారు. ఈ ఏప్రియల్ నెలలో జరగవలసిన రాష్ట్రపతి ఎన్నికలకు 5వ సారి కూడా బౌటిఫ్లికానే అభ్యర్థిగా కొనసాగిస్తామని జాతీయవిముక్తి సంఘటన ప్రకటన జారీచేసిన తర్వాత మార్చి 8, శుక్ర వారంనాడు ప్రదర్శనతో వరుసగా 3వ శుక్రవారం కూడా ప్రదర్శనలు చెలరేగినట్లయింది.

అల్జీరియా దేశంలో ఈ ఏడాది తొలి మూడునెలలూ పెరిగిన సమ్మెలు, రేవు కార్మికులతో పాటు రెండు రోజులపాటు దేశవ్యాపితంగా ఫిబ్రవరి నెలలో సాగిన ఉపాధ్యాయుల సమ్మెలూ, కబిల్యా ప్రాంతంలో జరిగిన రేవు కార్మికుల సమ్మెలూ దీనినే సూచిస్తున్నాయి. ఐరోపా దేశాలకు కూడా వస్త్ర సంబంధ ఉత్పత్తులను ఎగుమతిచేసే తయాల్ వస్త్ర పరిశ్రమకు చెందిన కార్మికులు ఫిబ్రవరి 27న నిర్వహించిన దేశ వ్యాపిత సమ్మె ఆ కార్మికుల పని పరిస్థితులకూ చట్టం నిర్దేశించిన వాటికంటే తక్కువగా యిస్తున్న వేతనాలపట్ల పెల్లుబుకుతున్న అసంతృప్తిని వెల్లడిస్తోంది. తయారెట్‌లో వుండే విడిభాగాలను కూర్చే హుండాయ్ కర్మాగారంలోని ఆటో రానికయర్‌లో కార్మికులు తమ పని పరిస్థితులకు వ్యతిరేకంగా సమ్మె చేశారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులతో కూడిన జాతీయ ఉపాధ్యాయ సమాఖ్య మార్చి 13న యిచ్చిన దేశవ్యాపిత సమ్మెలో సాధారణ ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు కూడా నిరసన ప్రదర్శనల్లో కలిసి పాల్గొన్నారు.

ప్రజాగ్రహాన్ని పసిగట్టిన 'జాతీయ విముక్తి సంఘటన' (ఎన్.ఎల్.ఎఫ్) ప్రభుత్వం బౌటఫ్లికా ఎన్నుకోబడిన సంవత్సరానికే రాజీనామా చేయించి, కేబినెట్‌లోని మరో మంత్రిని ప్రధానిగా నియమించారు. అయినప్పటికీ దేశ వ్యాపితంగా ప్రజలు కృతనిశ్చయంతో అల్జీరియాను స్తంభింప జేశారు.

దాదాపు దేశవ్యాపిత రైల్వే వ్యవస్థ కదలిక లేకుండా ఆగిపోయింది. రాజధాని అల్జీర్స్‌లో మెట్రో రైళ్ళు, బస్సులు, ట్రాములు నడవలేదు. నగరంలోని అంతర్గత ప్రైవేటు బస్సు రవాణా కూడా ఆగిపోయింది. సమ్మెలో ఉపాధ్యాయులు కూడా కలవటంతో, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు మూతపడ్డాయి. వివిధ పట్టణాలు, నగరాల్లో విద్యార్థులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. విశ్వవిద్యాలయా లన్నింటిని మూసివేశారు. సమ్మెను నిర్వీర్య పరచటానికి 10 రోజులు ముందే ప్రభుత్వం సెలవులు ప్రకటించింది.

అల్జీరియా దేశంలో అతిపెద్ద ప్రైవేటు కంపెనీ 'సీవైటల్' పంచదార, వంటనూనెలు తదితర వ్యవసాయోత్పత్తుల సంస్థనూ, బజాయియా రేవునూ మూసివేయించారు. ప్రభుత్వ నిర్వహణలోని గనుల తవ్వకం కంపెనీ తూర్పు ప్రాంతంలో వుండే 'హస్సిమెసోద్' లోని కార్మికులు, ఇంకా హస్సిబెర్లిన్ ఇన్నెనాస్ కార్మికులు, సొనెల్‌గాజ్ మొదలైన కంపెనీ లన్నీటిలో పని స్తంభించిపోయింది.

అల్జీరియా శ్రామికులను, ప్రజలను పోరాటాలవైపు నడుపుతున్నదేమిటి? 2015 నాటి అల్జీరియా మానవహక్కుల సమితి నివేదిక ప్రకారం జనాభాలో నూటికి 35 మంది అనగా ఒక కోటి నలభైలక్షలమంది ప్రజలు రోజుకు 1.25 డాలర్లు (మన దేశపు లెక్కన రోజుకి రూ.90/-కంటె తక్కువ) కంటె తక్కువ తక్కువ వేతనాలతో, కదుబీదరికంలో జీవిస్తున్నారు. నూటికి 90 కుటుంబాల వారి జీవన ప్రమాణాలు, 2014 చమురు ధరల తగ్గుదల నాటినుండి పడిపోయాయి. సుమారు 60శాతం కొనుగోలు శక్తిని ఈ కుటుంబాలు అదే కాలంలో కోల్పోయాయి. మూడింట రెండువంతుల జనాభా 30 ఏళ్ళవయసుకంటె తక్కువ వున్నప్పటికీ వారిలో మూడవ వంతుమంది నిరుద్యోగులుగా జీవిస్తున్నారు. మరోవైపు అతికొద్దిమంది చేతుల్లో సంపద పోగుపడి వుంది. ఈ వందల కోట్ల ధనాఢ్యులే అధికార, ప్రతిపక్ష వర్గాలను కూడా అదుపు చేస్తూ వున్నారు. ఓ నివేదిక ప్రకారం 10 శాతం పై శ్రేణి 80శాతం సంపదను స్వంతం చేసుకుని వున్నారు.

దిగజారిపోతున్న ఈ జీవన పరిస్థితులే ప్రజలను అవినీతిమయమైన బౌటిఫ్లికా పాలనపై పోరాటాల వైపుకు నడిపిస్తోంది. గడిచిన 5 ఏళ్ళకు పైగా-2013 నాటి దెబ్బనుండి-ప్రజల నడుమ కానరాకుండా వుండిపోయిన ఈ పాలకుడు మిలటరీ, రక్షణశాఖ, తన కుటుంబంతో కూడిన ముఠావాడిగా వుంటున్నాడు.

బౌటిఫ్లికాకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమానికి ప్రతిపక్ష పార్టీలు మద్దతు నందిస్తున్నారు కానీ వారు కార్మికుల, ప్రజలపట్ల తక్కువ వ్యతిరేకులు కారు. వారు కూడా అల్జీరియా ప్రజలను పేదరికంలోకీ, యమయాతనలలోకీ నెట్టిన విధానాలనే బిగ్గరగా చెప్పుకుంటూ వస్తున్నారు. అధికారంలో వున్న వ్యక్తులను మార్చటమే వారి లక్ష్యం. ఆవిధంగా ప్రజల ఆగ్రహాన్ని తగ్గించాలనే వొక రాజకీయ క్రీడ మొదలయింది.

సామూహిక సమ్మెలు విస్తృతమై రెండవ రోజుకూడా అల్జీరియా వ్యాపితమైన సమయంలో మార్చి 11వ తేదీన పేరుకి అధ్యక్షునిగా వుంటున్న అబ్దుల్ అజీజ్ బౌటిఫ్లికా పేరిట ఎన్నికల నిరవధిక వాయిదా గురించిన ప్రకటన వెలువడటమేకాక, బౌటిఫ్లికా ఐదవసారి అధికారాన్ని కోరుకోవటంలేదనే వాగ్దానాల్ని కూడా ప్రకటించారు.

ప్రభుత్వం చేసిన ఈ ప్రకటన కార్మికుల, విద్యార్థుల ఏ కోర్కెల దరికి చేరటంలేదు. బౌటిఫ్లికా మరొకసారి ఎన్నికలలో పాల్గొనడని ప్రకటించారు కానీ అతనే నిరవధికంగా అధికార స్థానంలో కొనసాగేట్లు చేస్తున్నారు. ఏప్రియల్ 18వ తేదీకి జరగవలసిన ఎన్నికలను 2019వ సంవత్సరం గడిచిన తర్వాత మాత్రమే జరుగనున్నట్లు వాయిదా వేశారు.

కొత్త రాజ్యాంగ చట్టాన్ని రూపొందించి, ఎన్నికల తేదీని నిర్ణయించే వొక "సమ్మిళిత, స్వతంత్ర జాతీయసభ"ను ప్రభుత్వం నియమిస్తుందని ప్రకటించారు. ఒక అనిర్దిష్టమైన "జాతీయ ఐక్యతా ప్రభుత్వాన్ని ఏర్పరుస్తారు", నూతన "చట్టబద్ధ వ్యవస్థలు తమ లక్ష్యాలను, సాధించటానికి నమ్మకంగా కట్టుబడి వుండేట్లు" బౌటిఫ్లికా పరికిస్తూ వుంటారు.

అదే ప్రకటనలో "శాంతి యువమార్గానికీ, ప్రశాంతమైన ప్రజాభద్రతకూ" హామీనిస్తూనే, సమ్మెలూ-ప్రదర్శనలను తీవ్రంగా అణచి వేస్తామనే బెదిరింపులను ధ్వనింపచేశారు.

రాజకీయ పరివర్తన సాకుతో ప్రస్తుత ప్రభుత్వాన్నీ, పరిపాలకుడినీ కాపాడుకునే విధమైన ప్రభుత్వ ప్రకటనను అసమ్మతిని సూచిస్తూ ప్రదర్శనలు కొనసాగుతూనే వున్నాయి. "మేము బౌటిఫ్లికా లేని ఎన్నికలను కోరుకుంటే ఇపుడు మాకు ఎన్నికలు లేని బౌటిఫ్లికాను వుంచారు" అని నిరసన ప్రదర్శకులు నినదిస్తూ వున్నారు. "వారు మమ్ములను పూడ్చిపెట్టాలని చేశారు కానీ వారికి తెలియదు మేము విత్తనాలు లాంటివారమని"! (ఒకనాటి అల్జీరియా వలస పాలకులయిన) ఫ్రెంచి దేశాధ్యక్షుడు ఇమాన్యుయల్ మాక్రాన్ బౌటిఫ్లికాకు మద్దతు యిచ్చినందుకు అతనిని సూటిగా ఉద్దేశించి కూడా కొన్ని నినాదాలు చేస్తున్నారు. "నీ దేశంలో సాగుతున్న యెల్లోవెస్టు ఉద్యమకారులను పట్టించుకుంటే అంతే చాలు, మాక్రాన్!" అంటూనే, ఇంకా-"కట్టెలు జాగ్రత్త పెట్టుకో ఈ ఏడాది నీకు అల్జీరియా గ్యాస్ అందదు కదా!!"

ఇదే తరహా సమ్మెల వెల్లువ ఇతర ఉత్తరాఫ్రికా దేశాలలో కూడా సాగుతున్నాయి. మొరాకోలో ఫిబ్రవరి 20న వేలాదిమంది కాంట్రాక్టు ఉపాధ్యాయులు దారుణ పరిస్థితులను సమీక్షించాలంటూ కాంట్రాక్ట్ పెద్దఎత్తున ప్రదర్శనలు చేశారు. అనేక వేలమంది మునిసిపల్ ఉద్యోగులు ప్రమాదకరమైన తమ పనిపరిస్థితులపట్ల నిరసన వ్యక్తం చేస్తూ 24 గంటలపాటు ప్రదర్శనలు చేశారు.

ట్యునీషియాలో ఉన్నత పాఠశాల ఉపాధ్యా యులు తమను సాధారణ ఉద్యోగులుగా 2018 అక్టోబరు నుండి సమ్మెలో వున్నారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కూడా దిగజారి పోతున్న తమ పనిపరిస్థితుల పట్ల నిరసన తెలుపుతూ పై డిమాండ్లనే వ్యక్తం చేస్తున్నారు. ఫిబ్రవరి 8వ తేదీకి దేశవ్యాపిత సమ్మెకు పిలుపునిచ్చిన ప్రభుత్వానుకూల కార్మిక సంఘాలు, సామూహిక తిరుగుబాటుగా మారే ప్రమాదం వుందని భయపడి తమ పిలుపుని ఉపసంహరించుకున్నారు. నైజీరియా, సూడాన్ దేశాల్లోని ంప్రభుత్వాలు కూడా వివిధ వర్గాల ప్రజానీకాన్నుండి యిదే విధమైన నిరసన ప్రదర్శనలు ఎదుర్కొంటున్నారు.

సోషలిస్టు సమాజాన్ని నిర్మించే దృక్పధంతో ప్రస్తుత పరిపాలనలకు వ్యతిరేకంగా ప్రజ లందరూ తమ రాజకీయ పోరాటాలను ఎక్కుపెట్టటం నేటి తక్షణ అవసరం.

ooo